

వైఎస్ఆర్

శాంతి భద్రతలను కాపాడుదాం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేయాలని ఎఆర్ ఎఎస్‌పి ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు పేర్కొన్నారు. ఎస్‌పి ఆదేశాల మేరకు కడపలో నిర్వహిస్తున్న మోబ్-రయట్ డ్రిల్ శిక్షణను ఆయన సందర్శించారు. శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందించే అడిగి తెలుసుకున్నారు. ఎస్.పి ఆలోచనా విధానానికి తగ్గట్లుగా తాము మరింత మెరుగైన విధులు నిర్వర్తించేందుకు కార్యక్రమం దోహదపడుతుందని వారు తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గించే, విధ్వంసానికి ప్రయత్నించే అల్లరిమూకలను ఉక్కుపాదంతో అణిచి వేసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇలాంటి శిక్షణ వల్ల తామంతా సమష్టిగా ఉన్నామన్న ధైర్యాన్నిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఆర్‌ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, టైటాస్, ఆర్‌ఎస్‌ఐలు, ఎఆర్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భువనేశ్వరి పర్యటన

నేడు గాలివీడు, 22న బద్వేల్‌లో కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి మూడ్రోజులపాటు కడప, అన్నమయ్య జిల్లాల్లో పర్యటించనున్నారు. 20, 21, 22వ తేదీల్లో ఆమె పర్యటన ఖరారైంది. చంద్రబాబు అరెస్టుకు గురై జైలులో ఉండటాన్ని తట్టుకోలేక చనిపోయిన కార్యకర్తల కుటుంబాలను 'నిజం గెలవాలి' అనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తల కుటుంబాలను పరామర్శిస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం అన్నమయ్య జిల్లాలోని గాలివీడు మండలం ఎగువగొట్టివీడు గ్రామంలో మృతి చెందిన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి చెక్కులు అందజేస్తారు. మధ్యాహ్నం రాయచోటి పట్టణం రాజుల కాలనీలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. అదే రోజు రాత్రికి తిరుపతిలో బస చేస్తారు. 21వ తేదీన తిరుమల దర్శనం చేసుకుని సాయంత్రానికి పోరుమామిళ్ల చేరుకుంటారు. కొత్తవీధి, బలిజకోట, చెన్నంపల్లి బాధిత కుటుంబాలను పరామర్శించి బద్వేల్‌కు వెళతారు. రాత్రికి బద్వేల్‌లోని ఆర్‌టిసి కన్వెన్షన్ హాల్‌లో బస చేస్తారు. 22వ తేదీన బద్వేల్ పట్టణంలోని గుంతపల్లి, లింగారెడ్డిపల్లి, కలసపాడు మండలంలోని బ్రాహ్మణపల్లి, తెల్లపాడు గ్రామాల్లో పర్యటిస్తారు. బాధిత కుటుంబాలను పరామర్శించి చెక్కులు పంపిణీ చేస్తారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన గూడూరుకు బయలుదేరి వెళతారు.

27 నుంచి జగన్ బస్సుయాత్ర

ఇడుపులపాయ నుంచి ప్రారంభం
ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' సభ



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రకు రంగం సిద్ధమైంది. రెండు నెలల కిందటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సిద్ధం సభలు చేపట్టింది. కేంద్ర ఎన్నికల కమిషన్ ఇటీవల ఎన్నికల షెడ్యూలు విడుదల చేసింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. వైసిపి అధ్యక్షులు జగన్ బస్సుయాత్రను వేగవంతం చేశారు. రాష్ట్రంలో సిద్ధం సభలు నిర్వహించిన ప్రాంతాలు మీదుగా బస్సుయాత్ర సాగించనుంది. ఇటీవలే వైసిపి నాయకత్వం రూట్‌మ్యాప్ సిద్ధం చేసే పనిలో నిమగ్నమైంది. ఈనెల 27వ తేదీన జిల్లాలోని ఇడుపులపాయ నుంచి వేంపల్లి మీదుగా ప్రొద్దుటూరులో 'మేమంతా సిద్ధం' పేరుతో భారీ బహిరంగసభ నిర్వహించనుంది. స్థానిక వైసిపి నాయకత్వం భారీ బహిరంగ సభ నిర్వహణకు ఏర్పాట్లను వేగవంతం చేసింది. ప్రొద్దుటూరు వైసిపి అభ్యర్థి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డికి ప్రతిపక్ష టిడిపి ధీటైన అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని నియమించడంతో పోటాపోటీ వాతావరణం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రొద్దుటూరులో భారీ బహిరంగసభ ప్రాధాన్యతను సంతరించుకుంది. సభ నిర్వహణను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేస్తోంది.

సిఎఎను వ్యతిరేకిద్దాం.. దేశాన్ని కాపాడుకుందాం

- సదస్సులో వామపక్ష నేతల పిలుపు

ప్రజాశక్తి - కడప అర్బన్

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, దేశ సమైక్యత సమగ్రతకు నష్టం కలిగించే సిఎఎను రద్దు చేసే వరకు పోరాడాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి. చంద్ర, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, సిపిఐ ఎంఎల్ డబ్ల్యూ రాము, రమణయ్య మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం 2019లో పార్లమెంట్‌లో ప్రతిపక్షాల నిరసనల మధ్య ఆమోదింప జేసుకున్న 'పౌరసత్వ సవరణ చట్టం' (సిఎఎ) ఆనాటి ప్రజా ఉద్యమాల ధాటికి తాత్కాలికంగా అమలు చేయలేకపోయిందని తెలిపారు. 5 సంవత్సరాల తర్వాత ఎన్నికలు రాబోతున్న తరుణంలో ఆ చట్టాన్ని అమలులోకి తెచ్చిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పక్కదారి పట్టించి, వైషమ్యాలు రెచ్చగొట్టి, మతకలహాలు సృష్టించి అధికారమే ధ్యేయంగా హిందువుల ఓట్లను కొల్లగొట్టేందుకు, నరమేధానికి తెగబడుతుందని ఆరోపించారు. బిజెపి హిందూత్వ వ్యవస్థను ఏర్పాటు చేయడానికే ఈ ప్రయత్నమని తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగం మౌలిక స్వరూపానికి విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 16, 25లను ఉల్లంఘిస్తుందని చెప్పారు. ముస్లిములు అధికంగా ఉన్న పొరుగు దేశాలలో పీడనకు గురవుతూ, శరణార్థులుగా వచ్చిన వారిని కాపాడేందుకు ఈ చట్టం తెచ్చామని ప్రజల్ని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఇది ఎంతమాత్రం నిజంకాదని తెలిపారు. మరి శ్రీలంక, బూటాన్, మయన్మార్‌లో పీడనకు గురవుతూ శరణార్థులుగా వస్తున్న వారికి ఎందుకు రక్షణ కల్పించటంలేదని ప్రశ్నించారు. రక్షణ కల్పించటం కొందరికి మాత్రమే వర్తించే సూత్రం అవుతుందా అని ప్రశ్నించారు. మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వటం ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతని పేర్కొన్నారు. ఈ దేశంలో నివసిస్తున్న హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, జైనులు, బౌద్ధులు, సిక్కులు ఇలా అన్ని మతాలవారూ భారతీయులే అన్నారు. ఈ దేశ ప్రజల మధ్య చీలికలు తెచ్చి భారతదేశ విచ్ఛిన్నానికి, వినాశనానికి ప్రయత్నిస్తున్న బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిఎఎ, ఎన్ఆర్‌సి, ఎన్‌పిఆర్‌కు వ్యతిరేకంగా దేశ సమగ్రతను కాపాడుకుంటూ, రాజ్యాంగ పరిరక్షణకోసం ఐక్యంగా పోరాడుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు ఎన్.వెంకట శివ, రామ్మోహన్,సుబ్రహ్మణ్యం, వీరశేఖర్, అన్వేష్, కే.సీ.బాదుల్లా, బి.మనోహర్, శ్రీనివాసులు రెడ్డి, దస్తగిరి రెడ్డి, గంగా సురేష్, శివకుమార్, వలరాజు, చిన్ని, మునయ్య, భాగ్యలక్ష్మి, శంకర్ నాయక్, శివశంకర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర

ఒపిఎస్‌తోనే ఉద్యోగులకు ప్రయోజనం : యుటిఎఫ్

ప్రజాశక్తి కడప అర్బన్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ విధానాల కన్నా పాత పెన్షన్ విధానమే ప్రయోజనకరమని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. మంగళవారం కలెక్టోరేట్‌లోని సిపిఎస్ ఉద్యోగులను కలిసి సిపిఎస్, జిపిఎస్ పెన్షన్ విధానాల వల్ల కలిగే నష్టాలను తెలియపరిచే బుక్లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగి 30 సంవత్సరాలకు పైగా ప్రభుత్వ సేవలో పని చేసినప్పటికీ విరమణ పొందిన అనంతరం భరోసాను కల్పించే పెన్షన్ విధానం లేకపోవడం వల్ల వృద్ధాప్య జీవితం ఒడిదుడుకులకు గురయ్యేే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతమున్నసిపిఎస్, జిపిఎస్, పెన్షన్ విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఏమాత్రం ప్రయోజకరం కాదని, పాత పెన్షన్ విధానమే అన్ని విధాల ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం ప్రతి ఒక్కరూ వివిధ రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకువచ్చే విధంగా ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల చిరకాల వాంఛ అయిన పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి, అమలుపరిచే రాజకీయ పార్టీల వెంట ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి సి.వి.రమణ, ఏజాస్ అహమ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రామ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పీడీని సస్పెండ్ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-కమలాపురం

కడప జిల్లా ఐసిడిఎస్ కేటాయింపులో నిధులను సెంటర్ రెన్యువేషన్‌లో ఏకపక్షంగా వ్యవహరించి అవినీతి అక్రమాల పాల్పడిన పీడీని సస్పెండ్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిరంగ వేలానికి, టెండర్‌కు పిలవకుండా ఏకపక్షంగా ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. ఐసిడిఎస్ అధికారుల చేతివాటం కమీషన్ల కక్కుర్తి కోసమే వస్తువుల కొనుగోలు చేశారని, ఐసిడిఎస్ అధికారులు కొన్న వస్తువులపై సమగ్రమైన విచారణ చేసి అవినీతికి పాల్పడిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐసిడిఎస్ పరిధిలో 13 ప్రాజెక్టులలో సొంతభవనాలు కలిగిన 1030 సెంటర్లు ఉన్నాయని, ప్రతి సెంటర్ నిర్వహణ నిమిత్తం ప్రతి ఏడాదీ రూ. 3 వేలు మంజూరు చేయాల్సి ఉండగా జిల్లాలో గత సంవత్సరం ఆ నిధులు చెల్లించలేదని పేర్కొన్నారు. అంగన్వాడీ నిర్వహణ నిమిత్తం రెండేళ్లకు కలిపి ఒక్కో సెంటర్‌కు ప్రభుత్వం నేరుగా రూ. 6 వేలు అంగన్వాడీ వర్కర్ ఖాతాలో జమ చేస్తే, రూ.3 వేలు వాడుకుని మిగిలిన రూ.3 వేలు వెనక్కి ఇవ్వాలని హుకుం జారీ చేయడం వెనకాల పరమార్థం ఏమిటో అర్థం కావడం లేదని వాపోయారు. ఎంటరు అవసరాల నిమిత్తం ఇచ్చిన డబ్బులను తిరిగి ఇచ్చేది లేదని ప్రశ్నించిన అంగన్వాడీ వర్కర్లకు మెమోలు ఇవ్వడం అధికారులకు తగదని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పీడీ, సిడిపిఓలు అవినీతికి పాల్పడుతుంటే జిల్లా అధికార యంత్రాంగం తమకేమీ పట్టనట్లు వ్యవహరించడం అవినీతి అధికారులను ప్రోత్సహించడమేనని పేర్కొన్నారు. వసూలు చేసిన డబ్బులకు గుండు గుత్తగా ఒకే సంస్థ ద్వారా వస్తువులు కొని సరఫరా చేస్తామని చెబుతున్నా ఐసిడిఎస్ అధికారులు వాటికి సంబంధించిన టెండర్లు ఎప్పుడు పిలిచారో, ఏ పత్రిక ద్వారా ప్రకటన చేశారో బహిర్గతం చేయాలన్నారు. .ఐసిడిఎస్ అధికారుల చేతివాటం, కమీషన్ల కక్కుర్తి కోసమే వస్తువులు కొనుగోలు చేశారని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ఐసిడిఎస్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కమలాపురం సిఐటియూ నాయకులు రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు

కాంగ్రెస్‌లో చేరిన గౌస్‌పీర్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరానికి చెందిన పీస్ గ్రూప్స్ విద్యాసంస్థల అధినేత, అంతర్జాతీయ అవార్డు గ్రహీత పీస్ సయ్యద్ గౌస్ పీర్ మంగళవారం హైదరాబాద్ లోటస్‌పాండ్‌లో ఉన్న పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల స్వగృహంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ కడప నగరానికి చెందిన ప్రముఖులు విద్యాసంస్థల అధినేత, సోషల్ వర్కర్‌గా సేవలందిస్తూ ప్రజల మన్నన్నలు పొందుతున్న సయ్యద్ గౌస్ పీర్ కాంగ్రెస్ పార్టీలోకి రావడం హర్షనీయమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం విశేష కృషి చేసి పార్టీని గెలిపించుకోవాలన్నారు. సయ్యద్ గౌస్‌పీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం శక్తికి మించి విశిష్ట సేవలు అందించి, పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక మెజారిటీతో గెలిచి, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు.



గౌస్‌పీర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న షర్మిల

డిఎస్‌సి పరీక్ష వాయిదా వేయండి

కడప అర్బన్ : ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనందున ఉపాధ్యాయ డిఎస్‌సి పరీక్ష వాయిదా వేయాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి లేఖ రాశారు. ఎన్నికల పూర్తయిన తర్వాత డిఎస్‌సి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

టిడిపిని ఆదరించండి

ప్రజాశక్తి- కడప అర్బన్

వచ్చే ఎన్నికల్లో ప్రజలు టిడిపిని ఆదరించాలని కడప నియోజకవర్గం అభ్యర్థి మాధవిరెడ్డి కోరారు. మంగళవారం నగరంలోని 37వ డివిజన్ సాయిపేటలోని గంగమ్మ గుడి నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు టిడిపి ఆరు గ్యారెంటీ పథకాలను వివరించారు. కారక్రమంలో యువరాజ్, సుబ్బారెడ్డి, జాకీర్, రాజ, చంద్ర, మన్సూర్, అసిఫ్, సునీత,ఆస్మా, ప్రణవతి, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి మాధవిరెడ్డి

నాణ్యతలో రాజీపడొద్దు : కమిషనర్

ప్రజాశక్తి - కడప అర్బన్

అన్నమయ్య సర్కిల్, కృష్ణ సర్కిల్, పొట్టి శ్రీరాములు సర్కిల్, దేవుని కడప రోడ్డు ప్రాంతాలను టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులు, ఆర్అండ్‌బి శాఖ, ఇంజినీర్ విభాగ అధికారులతో కలిసి కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పరిశీలించారు. అన్నమయ్య సర్కిల్ వద్ద నుంచి కృష్ణ సర్కిల్ వరకు కొనసాగుతున్న పనులలో నాణ్యత లోపాలు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మ్యాన్ హోల్ పనులను తక్షణమే పూర్తి చేయాలని తెలిపారు. అదేవిధంగా డివైడర్లకు నిర్మించడానికి తగిన ప్రణాళికలను ఏర్పాటు చేయవలసిందిగా ఇంజినీర్ విభాగ అధికారులకు సూచించారు. నిర్మిస్తున్నటువంటి డ్రెయినేజీ పనులపై స్లాబ్ ఏర్పాటు చేయాలని, పనులను ఏకకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులను పూర్తి చేయాలని, ఆక్రమణకు గురైన వాటిని తక్షణమే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. అనంతరం దేవుని కడప రోడ్డు లో చేస్తున్న పనుల నాణ్యతను, పురోగతిని పాటించాలని అధికారులకు సూచించారు. ఉర్దూ మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాల ఎదుట డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. పాఠశాల పోలింగ్ బూత్‌కు ఉన్నందున ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తిచేసి ర్యాంపు, మెట్లలో నిర్మించు విధంగా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగ అధికారులకు ఆదేశించారు. లెవెల్స్ ఆధారంగా డ్రెయినేజీ పనులను పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు.



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్

ఫ్లోటింగ్ బ్రిడ్జి కట్టలేని వారు పోలవరం ఎలా కడతారు? : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

లోటింగ్ బ్రిడ్జి కట్టలేని వారు పోలవరం ఎలా కడతారని కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు ప్రశ్నించారు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బటన్ నొక్కుడు కంటే బొక్కుడు ఎక్కువైందన ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. పేదలకు, పెత్తందారులకు యుద్ధమని కల్లబొళ్ళు కబుర్లు, ఫ్లోటింగ్ బ్రిడ్జి కట్టలేని వారు పోలవరం ఎలా కడతారని ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. అవినీతి అనకొండ జగన్ రెడ్డి తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తూ ఏది కనపడితే దానిని ఆమాంతం మింగేశారని విమర్శించారు. మంచి, చెడు, న్యాయం, అన్యాయం అనే విచక్షణ మర్చిపోయి అధర్మాన్ని నాలుగు కాళ్లపై ఐదేళ్లపాటు రాష్ట్రంలో నడిపించారు. కొట్టుకుపోయిన ప్రాజెక్టు గేట్లు పెట్టలేని వారు కొత్తగా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టగలుగుతారా? సెక్రటేరియట్‌ను తాకట్టు పెట్టిన వారు రాజధాని ఎలా నిర్మిస్తారు? జగన్ రెడ్డి నొక్కుతుంది బటన్ కాదు, ప్రజల పీక అని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఘంటారావం మోగింది. ఓటు అనే వజ్రాయుధంతో రాక్షస సంహారం జరిపేందుకు ప్రజల సిద్ధమవుతున్నారు. ఊక దంపుడు ఉపన్యాసాలతో, బూటకపు మాటలతో ప్రజలను మభ్య పెట్టడానికి, మాయ చేయడానికి మరలా భస్మాసురుడు వస్తున్నాడని ప్రజలు ఆలస్యంగానైనా గుర్తించారు. కాబట్టి ప్రజలు విజ్ఞతతో ఆలోచించి అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అత్యధిక మెజార్టీ సీట్లు ఇచ్చి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ఎల్ఎల్‌బి పరీక్షల నిర్వహణలో మార్పు

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో ఈ నెల 23న జరగాల్సిన 3,5 సంవత్సరానికి చెందిన లా పరీక్షలు 24వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొన్ని సాంకేతిక కారణాల దృష్ట్యా ఈ మార్పు చేశామని, విద్యార్థుల గమనించాలి తెలిపారు. మిగిలిన పరీక్షలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

విద్యార్థినులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన ఇద్దరు విద్యార్థినులు మిద్య రూపా, సయ్యద్ సానియా పార్లమెంటులో అద్భుతంగా ప్రసంగించారు. వీరిని మంగళవారం కళాశాల స్టూడెంట్ యూనియన్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యువ కేంద్ర యూత్ ఆఫీసర్ మణికంఠ మాట్లాడుతూ కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి మిద్దె రూప 2022, అక్టోబర్ 2న పార్లమెంటు సెంట్రల్ హాల్లో చాలా అద్భుతంగా ప్రసంగించిందని చెప్పారు. ఈ ప్రసంగాన్ని కళాశాలలోని ఇతర విద్యార్థులంతా స్ఫూర్తిగా తీసుకుని ఇకముందు జరిగే పోటీలలో పాల్గొనాలని కోరారు. ఇదే కళాశాలకు చెందిన సయ్యద్ సానియా నేషనల్ యూత్ పార్లమెంట్ పోటీలలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయస్థాయిలో ఈనెల 5, 6వ తేదీలలో జరిగిన జాతీయ యువ పార్లమెంటు ఉత్సవంలో అద్భుతంగా ప్రసంగించి అందరి మన్నలను పొందిందని తెలిపారు. వీరిద్దరి విజయాలను, ప్రసంగాలను స్ఫూర్తిగా తీసుకుని భవిష్యత్తులో జరగబోయే పోటీలలో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో గెలుపొందడమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా విజయాలను సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా మాట్లాడుతూ పార్లమెంటు సెంట్రల్ హాల్లో ప్రసంగించడం హర్షణీయమన్నారు. తమ కళాశాలలో రూపా, సానియా లాంటి ఆణిముత్యాలు మరెందరో ఉన్నారని వారందరూ కూడా భవిష్యత్తులో మంచి విజయాలను సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సన్మాన గ్రహీతలైన మిద్దరూప, సయ్యద్ సానియా మాట్లాడుతూ తాము జాతీయస్థాయిలో విజయం సాధించడానికి తమ తల్లిదండ్రుల, కళాశాల, నెహ్రూ యువ కేంద్ర కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.సి దేవి, డాక్టర్ గురు మోహన్ రెడ్డి, డాక్టర్ కె.వి కృష్ణవేణి, కె.వి రమణ, సుబ్బారెడ్డి, శాలిని, రవి శేఖర్, నాగవేణి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పార్లమెంటులో ప్రసంగించిన విద్యార్థినులను సన్మానిస్తున్న అతిథులు

ఎన్‌జిఒలు అవగాహన కల్పించాలి : జడ్జి

ప్రజాశక్తి - కడప

విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివిధ సమూహాలకు అందేలా ఎన్‌జిఒలు అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం న్యాయ సేవా సదన్‌లో విభిన్న ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద వారి అర్హతలను పొందేందుకు వివిధ లక్ష సమూహాలకు సహాయం అందించేందుకు ఎన్‌జిఒలతో సమన్వయ సమావేశాన్నిచనిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఎన్‌జిఒల యాక్టివిటీస్ అడిగి తెలుసుకున్నారు. వారిపాత్ర సమాజంలో కీలకమని, అన్ని వర్గాల పట్ల అవేర్నెస్ కలిగించి ప్రభుత్వ పథకాలు వారికి అందేలా చూడాలన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం గురించి వివరి ంచారు. ఉచిత న్యాయ సహాయం, లోకాయుక్త, గురించి వివరించారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి దృష్టికి తీసుకుని రావాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి. హరిబాబు, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం. శాంత, ఎన్జీవోలు పాల్గొన్నారు.


అధికారులపై చర్యలు తీసుకోవాలి : టిడిపి

కడప అర్బన్ : ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కడప పార్లమెంట్ అధ్యక్షులు, పొలిట్ బ్యూరో సభ్యులుశ్రీనివాస్ రెడ్డి, కడప అసెంబ్లీ ఇఇన్‌ఛార్జి మాధవి రెడ్డి సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరైన చిలకలూరి పేట బొప్పాడి 'ప్రజాగళం'సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నాతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలిపారు. లక్షలాదిమంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమని పేర్కొన్నారు. బిజెపి, టిడిపి,జనసేన తొలి ఎన్‌డిఒ సభ నభూతో నభవిష్యత్ అన్నట్టు విజయవంతమైందని తెలిపారు. మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులంతా పాల్గొని సభను విజయవంతం చేశారని పేర్కొన్నారు. అయితే ట్రాఫిక్ జామ్ వల్ల వేలాదిమంది సభకు రాలేకపోయారని తెలిపారు. లక్షలాదిమంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా అని, కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని పేర్కొన్నారు. స్వయంగా ప్రధాని హాజరైన సభ వైపు జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని తెలిపారు. పోల్స్ ఎక్కినవారు దిగాలని, వారిని స్థానిక పోలీసులు నియంత్రించాలని స్వయంగా ప్రధానే చెప్పారంటే పోలీసు వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు అని పేర్కొన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీస్ బాస్‌లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలని పేర్కొన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని తెలిపారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టిడిపి, జనసేన, బిజెపి నేతలు, కార్యకర్తలు సభను బ్రహ్మాండంగా విజయవంతం చేశారని పేర్కొన్నారు.

వైసిపి ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -పోరుమామిళ్ల

వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామని రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, యువ నాయకులు గిరిప్రణితరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని గిరి నగర్ లో ఏర్పాటు చేసిన ఇంటింట ప్రచారంలో పాల్గొన్నారు .ప్రతి గడపకు తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తు పైన ఓటు వేసి వేయించి అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి చేసినటువంటి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుపెట్టుకొని ఫ్యాన్ గుర్తుపైన ఓటు వేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిటిసి ముత్యాల ప్రసాద్, వైస్ సర్పంచ్ రుద్రవరం ప్రసాద్, రాము, జగన్మోహన్ ఆచారి, శ్రీనివాస్ ఆచారి, పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





అవగాహన కల్పిస్తున్న అధికారులు

తల్లీబిడ్డల సంరక్షణే లక్ష్యం

ప్రజాశక్తి - చక్రాయపేట

తల్లీబిడ్డ సంరక్షణే లక్ష్యంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం పోషణ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించినట్లు వేంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి సుశీల పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంగన్వాడీ ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దాదాపు 15 రోజులపాటు జరిగే కార్యక్రమాల్లో గర్భిణులు, బాలింతలు తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాహారం, రక్తహీనత, ముర్రుపాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నాగ సుభాషిని, సిహెచ్ఓ వెంకట్రామిరెడ్డి, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చీనీలో బంక తెగులు నివారణ తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

చీనీ తోటల్లో బంక తెగులు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలు తప్పనిసరి అని ఉద్యానశాఖాధికారి మల్లేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది తీవ్ర వర్షాభావంతో ఎండలు ఎక్కువగా ఉన్న పరిస్థితుల్లో చీనీ చెట్లకు బంక తెగులు రావడం అధికంగా ఉందన్నారు. ముఖ్యంగా ఎనిమిది సంవత్సరాలు పైబడిన చెట్లలో అధికంగా దీని ప్రభావం కనిపిస్తుందన్నారు. రైతులు ఈ బంక తెగులు నివారించకపోతే చెట్లు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు బంక తెగులు అధికంగా ఉన్న చెట్లకు ఫోసిటైల్ 80 శాతం డబ్ల్యుపి మందును లీటర్ నీటికి రెండు గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలన్నారు.

వైసిపి నాయకుల ప్రచారం

ప్రజాశక్తి - చక్రాయపేట

కల్లూరుపల్లి సర్పంచ్ పురుషోత్తం నాయక్ మంగళవారం మండలంలోని కల్లూరుపల్లి గ్రామ సిద్ధారంపల్లిలో గడపగడపకూ ప్రచారం చేశారు. వైసిపి ప్రభుత్వంలో నవరత్నాలలో జరిగిన మేలును ప్రతి ఇంటికి వివరించారు. రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ సభాపతి నాయుడు, కల్లూరుపల్లి సర్పంచ్ పురుషోత్తం నాయక్, దుద్యకుంటపల్లి చలపతి నాయుడు, వెంకటరమణ నాయుడు. వెంకట మల్లన్న నాయుడు, రఘునాథ నాయుడు, హరిశేఖర్ నాయుడు, మధుసూదన్ నాయుడు. శ్రీహరి నాయుడు, అంజనప్ప నాయుడు, శంకర్ నాయక్, భాస్కర్ నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రమేష్, పులివెందుల అసెంబ్లీ కమిటీ సభ్యుడు శేఖర్రెడ్డి తిరుపాల్రెడ్డి, సింహాద్రిపురం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు బ్రహ్మం తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశమంతటా కాంగ్రెస్ గాలి వీస్తోం దన్నారు. మహిళలకు పెద్ద ఎత్తున వరాలు ప్రకటించ నున్నారు. ప్రతి కుటుంబంలో మహిళకు సంవత్సరానికి లక్ష రూపాయలు ఆర్థికసాయం అందిస్తారన్నారు. ఉద్యోగాల్లో కూడా 50 శాతం రిజర్వేషన్ మహిళలకు ప్రకటించనున్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి శాయ శక్తుల కృషి చేస్తామని వారు తెలిపారు.



ఓటేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న సుధీర్‌రెడ్డి

అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

వైసిపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని జమ్మలమడుగు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కలమల్ల గ్రామం బొమ్మెపల్లి, ఆర్అండ్ఆర్ సెంటర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ నెంబర్లపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

మహిళల, పిల్లల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పథక సంచాలకులు శ్రీలక్ష్మి సూచించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం సిడిపిఒ ముంతాజ్ బేగం ఆధ్వర్యంలో పోషణ్ పఖ్వాడ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పథక సంచాలకులు శ్రీలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫుడ్‌స్టాల్‌ను సందర్శించారు. అనంతరం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బేటీ బచావో-బేటీ పడావో గురించి వివరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన చేశారు. కార్యక్ర మంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, సూపర్‌వైజర్లు భారతి, ఉమారాణి, ప్రవీణ కుమారి, బ్లాక్ కో-అర్డినేటర్ జోగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ముద్దనూరు : స్థానిక యాదవ కాలనీకి చెందిన ప్రముఖ ఫోటోగ్రాఫర్ సుధాకర్ కుమారుడు యశ్విన్ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలో ఉన్న ఏసు కరుణాలయం మానసిక వికలాంగుల అనా థాశ్రమంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్) : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని లేపాక్షి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం విభాగం రెండు ప్రత్యేక క్యాంపులో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ రూరల్ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో చెట్ల పెంపకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందని స్థానికులను కోరారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యంతో పర్యావరణం కలుషితమవుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రభుత్వం ఎంతో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ పుల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఖాజీపేట

స్థానిక ఆదర్శ పాఠశాలలో పది పరీక్షల్లో చీటీలు వేస్తూ కాపీయింగ్‌కు పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు సిఐ పి.రామాంజులు మంగళవారం తెలిపారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వెంకట శివుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని సిఐ తెలిపారు.

నాణ్యతకు తిలోదకాలు..

నాసిరకంగా ప్రధాన రహదారి నిర్మాణం - పట్టని అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

స్థానిక నగర పంచాయతీ పరిధిలో ప్రొద్దుటూరు ప్రధాన రహదారి మెయిన్ బజార్ ప్రాంతంలోని పోస్టాఫీసు వద్ద నుండి పాత రైల్వే గేట్ వరకు దాదాపు 400 మీటర్ల మేర నూతన సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. రూ.1.20 కోట్ల స్టేట్ హైవే నిధులతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఎంతోకాలంగా రోడ్డు ఛిద్రమై గుంతల మయంగా ప్రజల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉండేది. పలుమార్లు అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదు. ఇప్పటికైనా నూతన రోడ్డు నిర్మిస్తున్నారని వాహనదారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలే నాసిరకం రోడ్డు నిర్మాణాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం ఇసుక, సిమెంట్ వాడుతూ రోడ్డు నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా, అధికారుల పర్యవేక్షణ లేకుండా పనులు చేయడం ఏంటని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు వేసే క్రమంలో లావుపాటి రాళ్లను కూడా కలిపి వేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగు ఇంచులు కాంక్రీట్ బెడ్ తర్వాత కాంక్రీట్ బెడ్‌పై 8 ఇంచుల సీసీ రోడ్డును నిర్మించేలా పనులు ప్రారంభమయ్యాయి. కాంక్రీట్ బెడ్ నాసిరకంగా వేస్తే ఇక రోడ్డు పరిస్థితి ఎలా ఉంటుందో అంటూ స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ రోడ్డు గుండా బస్సులు, ట్రాక్టర్లు, అధిక లోడుతో లారీలు వంటి భారీ వాహనాలు



నాసిరకంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు, నిర్మాణానికి వాడుతున్న నాసిరకం ఇసుక

రాకపోకలు సాగిస్తుంటాయి. నాసిరకంగా వేస్తే మన్నిక ఎలా వస్తుందని స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఆర్అండ్‌బి అధికారులను వివరణ కోరగా.. రోడ్డు వేసిన తర్వాత క్వాలిటీ కంట్రోల్ చెక్ చేసి బిల్లులు మంజూరు చేస్తామని చెప్పడం గమనార్హం. ఇంజనీర్ల పర్యవేక్షణలో వేయవలసిన సిసి రోడ్డు అధికారుల ప్రమేయం లేకుండా కాంట్రాక్టర్ పనులు చేపట్టడం వెనుక పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న నాసిరకం పనుల వైపు సంబంధిత అధికారులు రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలతో రోడ్డు వేయాలని, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిబిఐటిలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్ల పరిశీలన



రెవెన్యూ సిబ్బందితో చర్చిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - చాపాడు

త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మైదుకూరు నియోజకవర్గస్థాయి స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుకు స్థానిక సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో కలెక్టర్ విజయ్‌రామరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు సిబిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో నియోజకవర్గ స్థాయి స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది కూడా అనుకూలమైన ప్రదేశాలను పరిశీలిస్తున్నామని, అందులో భాగంగా సిబిఐటిలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ మేరకు అవసరమైన రూములు, సామగ్రిని పరిశీలిస్తున్నామన్నారు. రెవెన్యూ సిబ్బంది, పోలీసులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ భూషణం, ఎంపిడిఒ మహబూబ్ బీ, రెవెన్యూ సిబ్బంది, కళాశాల కరస్పాండెంట్ విజయసాయిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాచమల్లుకు సహకరించేదే లేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరు నూరైన ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డికి ఈ ఎన్నికల్లో సహకరించేదే లేదని, ఈ విషయం అధిష్టానానికి కూడా తెలిపానని మైనార్టీ నాయకులు, 13వ వార్డు కౌన్సిలర్ సికిలిగిరి ఇర్ఫాన్‌బాషా పేర్కొన్నారు. తన ఇంట్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తను ఎమ్మెల్యే వెంట ఉన్నంతకాలం ఇర్ఫాన్ మనవాడే అనని ఎమ్మెల్యే ఇప్పుడు ఇర్ఫాన్ మనవాడే అనడం తనకు నచ్చలేదన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌ను ఏనాడైన ఎమ్మెల్యే తనవాడన్న స్థానాన్ని ఇచ్చాడా అని ప్రశ్నించారు. వరదరాజులరెడ్డి వయసు గురించి ఎమ్మెల్యే అవహేళన చేయడం గురించి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. 86ఏళ్ల వయసులో కూడా టిడిపి వరదకు టికెట్ ఇచ్చిందంటే అది ఆయన గొప్పదనమన్నారు. తన భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని ఇర్ఫాన్‌బాషా తెలిపారు.



మాట్లాడుతున్న ఇర్ఫాన్‌బాషా

27న ప్రొద్దుటూరులో జగన్
తొలి ఎన్నికల ప్రచార సభ : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మే 13న ఆంధ్రరాష్ట్రంలో జరుగబోయే సార్వత్రిక ఎన్నికలకు ఈనెల 27న ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రొద్దుటూరు నుండి తొలి ఎన్నికల ప్రచారసభ నిర్వహిస్తారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అన్నారు. వైసిపి అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసిం హారెడ్డి ఇంట్లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 27 నుండి 21రోజులపాటు ఇడుపులపాయ నుండి ఇచ్చాపురం వరకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారన్నారు. బస్సుయాత్ర ద్వారా ప్రచారం నిర్వహిస్తారన్నారు. తానెప్పుడూ ఎన్నికల నియమావళిని ఉల్లంఘించనని పేర్కొన్నారు. టిడిపి నాయకులు వ్యక్తిగత విమర్శలు మాని అభివృద్ధి, సంక్షేమంపై మాట్లాడాలని రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

'రెడ్యం' పార్టీలోకి రావడం శుభపరిణామం

ప్రజాశక్తి - మైదుకూరు

ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి వైసిపిలోకి రావడం శుభపరిణామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. స్థానిక డిసిఎల్ ఫంక్షన్ హాలులో మంగళవారం రెడ్యం తన అనుచరులతో ఎంపీ, ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా రెడ్యం మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీలో నీతి నిజాయితీలకు విలువ లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న పరిపాలనను చూసి వైసిపిలోకి వచ్చానన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం వచ్చేందుకు కృషి చేస్తానని, ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి విజయానికి కష్టపడి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, హార్టికల్చర్ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, హార్టికల్చర్ సలహాదారుడు పి.ప్రసాద్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త ఎస్.నాగిరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు, రెడ్యం అనుచరులు భారీస్థాయిలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో 'ఉక్కు' సాధ్యం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణం జరుగుతుందని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమలో ప్రత్యేకించి కడప జిల్లాలో నిరుద్యోగ సమస్య శాశ్వతంగా పరిష్కరించేందుకు కడప జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపట్టాలని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విభజన చట్టంలో పేర్కొందన్నారు. 2014లోగాని 2019లోగానీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఉంటే కడపలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేసి ఉండేదని చెప్పారు. జిల్లాలో ఉక్కు కర్మాగారం నిర్మాణానికి కావాల్సిన అన్ని హంగులు ఉన్నట్లు చెప్పారు. కడప, ప్రకాశం, అనంతపురం, బళ్లారి జిల్లాలో మ్యాంగ్ నెట్ ఉందన్నారు. రవాణాకు సంబంధించి రైలు, విమాన సౌకర్యం ఉందని చెప్పారు. యర్రగుంట్ల, కమలాపురంతోపాటు ఆయా ప్రాంతాల్లో సున్నపురాయి సంవృద్ధిగా ఉందని చెప్పారు. పెండ్లిమర్రి, వేములతోపాటు ఆయా ప్రాంతాల్లో డోలమైట్ కూడా ఉందని అన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మే 13న శాసనసభ, పార్లమెంట్ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన రాజకీయ పార్టీల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలకు లోబడి మెలగాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలో వాల్ పోస్టర్లు, వివిధ రాజకీయ పార్టీల ఫోటోలు వెంటనే తొలగించాలని ఆయన రెవెన్యూ, ఎంపి డిఒలకు సూచించారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు, వాలంటరీలు పాల్గొన వద్దన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎన్ని కలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఎంపిడిఒలు, తహశీల్దార్లు ఎప్పటికప్పుడు ఎన్నికల నివేదికలను తమకు పంపాలని ఆయన ఆదేశించారు.

సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని మాలెపాడు, ఇల్లూరు, చిన్న దండ్లూరు, కలమల్ల గ్రామాల ప్రధాన వీధుల వెంబడి కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్పీ సిద్ధార్ట్ కౌశల్ ఆదేశాల మేరకు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి కేంద్ర బలగాలతో మంగళవారం సాయంత్రం కవాతు నిర్వహించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో విని యోగించుకునేలా కేంద్ర బలగాల సహకారంతో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, కేంద్ర బలగాలు ఉన్నాయనే ధైర్యం ప్రజల్లో కల్పించేందుకే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, ఎస్ఐ సంజీవరెడ్డి



పారిశుధ్యంపై కుమ్మరాంపల్లెలో ర్యాలీ చేస్తున్న ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఎన్ఎస్ఎస్ యూనిట్ -2 ఆధ్వర్యంలో మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. మంగళవారం గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు విలువకు ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పారు. ట్రిపుల్ ఐటికి చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కూడా కుమ్మరాంపల్లె, నందిపల్లె గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించి, జీవనోపాధిపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 అధికారి డాక్టర్ మల్లేశ్వరమ్మ, డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, ఎంపిపి స్కూల్ హెచ్ఎం రెడ్డి మాలతి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అబద్ధపు హామీలకు స్వస్తి పలకండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న జగన్ ప్రభుత్వానికి స్వస్తి పలకాలని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మండలంలోని మోరగుడి గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భూపేష్ రెడ్డి సమక్షంలో పల్లా సత్యనారాయణ, సంతోష్, సరోజ, సత్యసాయి, గంజికుంట ఆంజనేయులు పార్టీలో చేరారు. భూపేష్‌రెడ్డి సమక్షంలో అభిమాని పుట్టినరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. స్టీల్ ప్లాంట్ నిర్మిస్తామని అబద్ధపు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, దేవగుడి యూత్, జనసేన పార్టీ నేత నాగార్జున, మోహన్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటరామిరెడ్డి, విశ్వనాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ధనుంజయ, పాండులు, గురుశంకర్, జయరాంరెడ్డి, బాల పుల్లారెడ్డి, చెన్నయ్య, ఇమ్మానియేల్, సుభాన్, రమణ, మా బాషా, లక్ష్మీ మునిస్వామి, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాగళం సభలో భద్రతా వైఫల్యం

ప్రజాశక్తి - చాపాడు

దేశ ప్రధాని నరేంద్ర మోడీ హాజరైన చిలకలూరిపేట బొప్పాడి ప్రజాగళం సభ వివిధ భద్రతల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లా టిడిపి పార్లమెంట్ అధికార ప్రతినిధి పి.మునిశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడడం దేనికి సంకేతమన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన తొలిసభ నభూతోనభవిష్యత్ అన్నట్లు విజయవంతమైందన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్, కరస్పాండెంట్ శైలుషా

గేట్‌కు 'గౌతమి' విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గేట్ ప్రవేశ పరీక్షలో గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఇద్దరు అర్హత సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు. మంగళవారం జమ్మలమడుగు రోడ్డులోని పెద్దశెట్టిపల్లె వద్ద ఉన్న గౌతమి మహిళా ఇంజనీర్ కళాశాలలో గేట్‌కు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా రామసుబ్బమ్మ మాట్లాడుతూ ట్రిపుల్ ఇ డిపార్ట్మెంట్‌కు చెందిన ఏ కృష్ణవేణి, ఈసీఈ డిపార్ట్మెంట్‌కు చెందిన ఎస్ జ్యోతి గేట్ పరీక్షలో రాణించారన్నారు. వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేయడంలోనే విద్యార్థుల భవిష్యత్ ఉందన్నారు. కళాశాల డైరెక్టర్లు నాగూర్ రవీంద్రారెడ్డి, కరస్పాండెంట్, బాబమ్మ, కో-డైరెక్టర్ శైలుషా, డిప్లమా ప్రిన్సిపల్ వై ప్రకాష్‌రావు, వివిధ విభాగ అధిపతులు బాల సుబ్బన్న, మహమ్మద్ జబీర్, యాకూబ్ అలీ, విజయమ్మ అభినందించారు.

ప్రాంగణ ఎంపికల్లో 16 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జెఎన్‌టియూ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్‌లో బీటెక్ నాలుగో సంవత్సరం సిఎస్ఈ బ్రాంచ్ నుండి నలుగురు, మెకానికల్ బ్రాంచ్ నుండి ఒక్కరు, త్రిపుల్ ఇ బ్రాంచ్ నుండి ఒక్కరు, ఇసిఇ బ్రాంచ్ నుండి పదిమంది మొత్తం ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రమణారెడ్డి తెలిపారు. వీరికి సంవత్సరానికి ప్యాకేజీ రూ.3.5 లక్షల నుండి నుండి రూ.5.51 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి ఎంపికైన విద్యార్థులను, ట్రెనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రాధాకృష్ణ, అసిస్టెంట్ ట్రెనింగ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సాంబయ్యను అభినందించారు.

మండ్లి సుబ్బమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక ప్రశాంతినగర్‌కు చెందిన మండ్లి సుబ్బమ్మ (80) మంగళవారం మరణించడంతో ఆమె మనవడు కాశీవిశ్వనాధ్, మనవరాలు పార్వతమ్మ, నాగ మల్లీశ్వరి, లక్ష్మీదేవి నేత్ర దానానికి అంగీకరిస్తూ స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమాచారమిచ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో కలిసి ఆయన మృతురాలి ఇంటికెళ్లి పార్థివదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్ డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులను బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం అభినందనలు తెలిపారు.